# శ్వేత మనోగతం



కత్తి పద్మారావు

**నా** పేరు శ్వేత. మా ఫరమ్స్ అన్ని నాగార్జున, సిద్ధార్థ పేర్లతో వున్నాయి కాబట్టి మా డాడీ నా పేరు సుజాత పెట్టమని అన్నారట. అయితే పేరు మోడ్రన్‌గా వుండాలని నాకు ఈ పేరు పెట్టారు. తాను అన్ని విషయాలు మోడ్రన్‌గానే ఆలోచిస్తారు. నాకు మూడేళ్ళప్పుడు మేము హైద్రాబాదు వచ్చాము. మా డాడీ బంజారాహిల్స్‌లో సినిమా వాళ్ల ద్వారా తక్కువ రేట్లో కొన్నారు. మాది నక్లెస్‌రోడ్డులో ఇల్లు. మమ్మీ ఎప్పటికప్పుడు మోడ్రన్‌గా ఆర్కిటెక్చర్స్‌తో ఈ ఇంటిని మోల్డ్ చేస్తూనే వచ్చారు. తనకి వైట్‌డాగ్స్ అంటే చాలా యిష్టం. చిన్న పిల్లల కంటె కూడా వాటితోటే ఎక్కువ గడుపుతారు. నేను ఇప్పుడు కంప్యూటర్ ఇంజనీర్ చేస్తున్నాను. నేను వేసుకునే బట్టలన్నీ యు.ఎస్.ఎ లో వున్న మా అన్నయ్య వాళ్ళు పంపిస్తారు. మమ్మీ ఇండియన్ గూడ్స్ పెద్దగా వాడరు. డాడీ సుమారు రెండు ఫ్యాక్టరీల పని చూస్తా వుంటారు. నిజానికి మార్నింగ్ నేను చూడకుండానే వెళతారు. ఈవినింగ్ కొన్ని సార్లే డాడీని చూస్తాను. మమ్మీ కూడా చాలా బిజీగా వుంటారు. మోడ్రన్ రిక్రియేషన్ క్లబ్‌లో మెంబర్. తను బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి డై చేసుకుని స్విమ్మింగ్ సెంటర్‌కు వెళ్ళి జిమ్‌కి వెళ్ళి 8-30 ని॥లకు ఇంటికి వస్తారు. నేను అప్పుడు కాలేజికి వెళ్ళే టైం. మమ్మీకి 40సం॥లు అయినా తను బాగా యంగ్‌గా కనిపిస్తారు. బ్రేక్‌ఫాస్ట్ చేసే టైంలో తను వస్తే ఏమీ తిననివ్వరని ముందే తినేస్తాను. తను ఒక ఇడ్లీ కంటె ఎక్కువ తింటే ఒప్పుకోరు. ఎక్కువ జ్యూస్ తాగాలని చెప్తారు. నా బాడీ స్లిమ్‌గా వుండటం కోసం అనేక వ్యాయామ వస్తువులు కొన్నారు. కాని నా బద్ధకం వల్ల నేను అవి వాడటం లేదు. తాతయ్య వృద్ధాశ్రమంలో వుంటారు. డాడీ నేను ఆదివారం వెళ్ళి చూసి వస్తాము. ఆయన నా నొసలు ముద్దు పెట్టుకుంటారు. ప్రేమకు సంబంధించిన అనుభూతి అది ఒక్కటే నాకు తెలుసు. మమ్మీ ఎక్కువ కోప్పడతారు. డాడీ లేని టైం చూసి 'మా మమ్మీ చూడక నాయనమ్మ చనిపోయింద'ని తాతయ్య చెప్తుంటారు. మాకు ఎవరైనా చుట్టాలు వచ్చినా డాడీ వాళ్ళను హోటల్లోనే దించుతారు. డాడీ వారితోనే హోటల్లో భోజనం చేస్తారు. మా అత్తయ్య వాళ్ళు ప్రేమగా అరిసెలు వండుకొస్తారు. మమ్మీ వాటిని తిననివ్వదు. 'అవి సరిగా చేయరు. వాళ్ళకు శుభ్రం వుండదు' అంటూ వాళ్ళు

వెళ్ళాక పనిమనుషులకు ఇస్తుంది. మా ఇంటినిండా కుక్కలు వుండటంతో తొందరగా మా యింటికి ఎవరూ రారు. అన్నయ్య వాళ్ళు యు.ఎస్.ఎ నుండి సెలవులకి వచ్చేటప్పుడు ఎక్కువ పెర్‌ఫ్యూమ్స్, బట్టలు రకరకాలు తీసుకొస్తారు. మమ్మీ తన ఫ్రెండ్స్‌ని పిలిచి ప్రజెంటేషన్స్ ఇస్తుంది. 'ఊళ్ళో వ్యవసాయం చేసే అంకుల్ వాళ్ళకు ఇవ్వవచ్చుకదా'? అని డాడీ అంటే 'వాళ్ళకు వాడుకోవడం రాద'ని మమ్మీ అంటుంది. మమ్మీ ప్రవర్తన నాకు ఆశ్చర్యం వేస్తుంది. మన అన్న వాళ్ళందర్ని దూరం చేస్తుంది. తన స్టేటస్‌కుదగ్గా వాళ్ళ అందరికి వస్తువులు ఇస్తుంది. మమ్మీకి కూడా ప్రేమ హృదయం వుంది. ఆమె ఎక్కువ తన పెంపుడు కుక్కల విషయంలోనే జాగ్రత్తగా వుంటుంది. మా కాలేజీలో అనూష, మృదు, నీత అనే స్నేహితులు వున్నారు. అనూష సెల్‌ఫోన్స్‌లో ఫ్రెండ్స్‌ని ఏడిపిస్తూ వుంటుంది. ఎందుకే అలా చేస్తావు అంటే వాళ్ళు మాత్రం చదువుకోవడానికి వచ్చి ఆడపిల్లల వెంబడి పడటం లేదా అంటుంది. మృదు మాత్రం ఎప్పుడూ చదువుకుంటూ వుంటుంది. మృదుల అంటే నాకు బాగా ఇష్టం. ముద్ద మొహం, పొడవాటి ముక్కు ఎప్పుడూ తనవెంట కూర్చోని నేను చదువు కోవాలని అనుకుంటాను. కాని నన్ను ఎవరు చదవనిస్తున్నారు. స్నేహితులతో మాట్లాడు కోవడం, నవ్వుకోవడంలో వున్నంత ఆనందం మా చదువుకోవడంలో లేదు. స్నేహితులు మనకు అర్థమయ్యే విషయాలు చెప్తారు. మనకు వినబుద్ధి వేస్తుంది. చదువులో సైంటిస్టు తన జీవితకాలం దారపోసి సిద్ధాంతాలు ప్రయోగాలు చెప్తారు. కాని అవి జీవితానికి అన్వయం అయినట్టు వుండవు. అందుకే చదువు పరీక్షల కోసం లాగానే వుంటుంది. మమ్మీ యేమో అన్నింట్లో పోటీ వుండాలంటుంది. మృదు తను చదువుకుంటూనే మాతో కబుర్లు చెబుతుంది. షాపింగ్‌కి వెళ్ళడం, సినిమాలకు వెళ్ళడం చాలా సరదాగా వుంటుంది. జంట్స్ స్మూత్‌గా ఏడిపిస్తే మేము పెద్దగా రియాక్ట్ కాము. వాళ్ళు రఫ్‌గా వున్నప్పుడు మాకు బాధ వేస్తుంది. ఏదైనా సెలవు వచ్చినప్పుడు ఇంట్లో వుండాలంటే బోరు కొడుతుంది. మా ఇంట్లో కుక్కలు పని మనుషులు తప్ప ఎవ్వరూ వుండరు. మ్యూజిక్ ఇనుస్ట్రుమెంట్స్ ఎన్నో వున్నాయి కాని ఎవరితో నన్న కలిసి పాడుతున్నప్పుడే సంగీతానికి అర్థం వుంది. మా మమ్మీ పట్టుచీరలు ఏ వూరిలో నేస్తారు. సిల్క్ చీరల వైరటీల గురించి తనకు అపారమైన నాలెజ్ వుంది. ఈ చీరల షాపుల వాళ్ళందరూ జ్యూయలరీ షాపులు కూడా పెట్టారు. మా మమ్మీ ఎన్ని ఆభరణాలు కొందో లెక్కలేదు. నిజానికి అవి అన్ని పెట్టుకోదు కూడా. చాలా ప్రక్కన వాళ్ళకోసం, మొహమాటాల కోసం, షాపుల్లో వాళ్ళు చెప్పే మాటల చాక చక్యంతో కొన్నవే గాని తనకు అవసరం వుండి కొన్నవి తక్కువ. తను ఎన్ని కొన్నా తనకు తృప్తి లేదు. నన్ను పెట్టు కొమ్మని బలవంతం చేస్తుంది. డాడీ మమ్మీ విషయాలు పట్టించుకోరు. నువ్వు అవి ఎందుకు కొన్నావు డబ్బులు ఎందుకు ఖర్చు పెడతున్నావు అనరు. ఏదైనా సందర్భంలో చర్చ పెట్టినా ఆమెతో నిలవడం కష్టం. తాను తనకున్న అనుభవం నుండే ఆర్గిమెంట్ చేస్తుంది. నిజానికి డాడీకి ఈ చీరలు, ఆభరణాలు ఇంటి వస్తువులకు సంబంధించిన జ్ఞానం తక్కువే. ఆయన ఫ్యాక్టరీలు, షేర్లు ఆయన ప్రపంచం వేరు. ఆ ప్రపంచం మాకు అసలు అర్థం కాదు. భూమి సరిహద్దుల్ని చెరుపుకుంటూ వెళ్ళాలనేది ఆయన ఆలోచన. వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం చూడాలి అదొక అసెంబ్లీ డిష్‌కషన్‌లాగా వుంటుంది. కాని చాలా ఆశ్చర్యం ఎన్నో వైరుధ్యాలతో వాళ్ళు కలసి జీవిస్తూనే వుంటారు. ఈ కో-ఆర్డినేషన్ నాకు ముచ్చటేసింది. ఏ అభిప్రాయం కలవక పోయినా మనుషులు ఎలా కలసి వుంటారో మా డాడీ మామ్మీలను చూసినప్పుడు నాకు ఆశ్చర్యం గొలిపే విషయంగా వుంటుంది. నిజానికి మా స్నేహితుల్లో కూడా ఎవ్వరికీ అభిప్రాయాల్లో కలయిక లేదు. మా నీత అయితే తాను కొంచెంబ్లాక్‌గా వుంటుంది. ఎవ్వరూ తనను ప్రేమించడం లేదని దిగులు పడుతుంది. మా స్నేహితుల్లో ఎవరికన్నా ప్రేమలేఖలు వస్తే తాను లాక్కొని చదువుతుంది. మా మృదు అయితే ప్రేమ లేదని చెపుతుంది. ఇది అంతా అబద్ధం అని చెప్తుంది. తన తల్లిదండ్రులు కుదిర్చిన వాళ్ళనే చేసుకుంటాను. ఇవన్నీ కాలేజీ రోజుల్లో ప్రేమలేనని చెప్తూ వుంటుంది. నిజంగా తను రాసే లేఖలు గాని ఫోన్‌లో అటెండ్ చేసే పద్దతి గాని చూస్తుంటే మనకు తను నిజంగా ప్రేమిస్తుందేమో అనిపిస్తుంది. పాపం తన బాయ్‌ఫ్రెండ్ తన కోసం ఎంతో ఖర్చుపెడుతుంటాడు, చదువు మానుకొని తిరుగుతూ వుంటాడు. తాను కూడా ఎంతో ఇన్వాల్ అయినట్టు వ్యవహరిస్తుంది. ఇదంతా చూస్తుంటే నాకు ఏది రియాల్టీయో ఏది కాదో నాకు తికమకగా వుంది. మా మృదు

# హైదరాబాద్ నానీలు

ఐమాక్స్‌లో
టీనేజ్ సినిమా తాకిడి
నెక్లెస్‌రోడ్‌కి
ఊపిరాట్టం లేదు.

ఇక్కడ
చినుకురాలితే భయం
అక్కడ
చినుకు కోసం ఆత్మార్పణం

కొత్తరోడ్లేస్తున్నారని
మురిసిపోకు
తెల్లారిచూడు
అన్నీ తవ్వకాలే !

నదిలో
గుడిసెల సాక్షిగా
నగరాన్ని
నందనవనం చేస్తాం

ఇక్కడ
ఆకాశం కళ్ళు ఎర్రబడ్డాయ్
విషవాయువుల
పరిష్వంగంతో

\- డా॥ సి.భవానీదేవి.

నాతో ఇంత సెన్సిటివ్‌గా వుండకూడదే అని చెప్తుంది. పైగా నీవు స్టేట్స్‌లో చదవాల్సిన దానివి అక్కడంతా పైపైనే వుంటారు. 'ఇదంతా లిప్స్ ప్రపంచమే' అని చెప్తూ వుంటుంది. 'ఒకరిని మోసం చేయటం తప్పుకాదా' అని నేనంటే ఇవన్నీ సీరియస్‌గా తీసుకోబాకే ఇదంతా కాలక్షేపం కోసమే అంటుంది. మాకాలేజీలో శ్రవ్య అనే అమ్మాయి ఒక బాయ్‌ఫ్రెండ్ చేత మోసం చేయబడి ఆత్మహత్యా యత్నం చేసుకోబోయింది. చివరికి ఆ అమ్మాయి ఎంతో కష్టంమీద బ్రతికి బయట పడింది. ఇక మా స్నేహితులందరూ 'ఎందుకే అంత సీరియస్‌గా తీసుకున్నావని ఏదీ లైఫ్‌లో సీరియస్‌గా తీసుకో కూడద'ని వేదాంతం మొదలుపెట్టారు. నాకు ఆశ్చర్యం వేసింది. ఏది సీరియస్ కాదు అసలు చదువుకోవడానికి వచ్చిన పిల్లలు ఎందుకు ఈ ప్రేమలో పడాలి. అవి ప్రేమలు కాదని ఎందుకు వాదించాలి. అసలు చదువు కంటే కూడా ఈ విషయాలపైనే వీరు ఎందుకు సీరియస్‌గా వుండాలి అని అనే ప్రశ్నలు నన్ను వేధిస్తూ వుంటాయి. ఈ ప్రశ్నలను ఎవ్వరితో పంచుకుందామన్నా వాళ్ళందరూ నవ్వు తున్నారు. నీ వెంట కూడా ఒకడు పడితే నీకు తెలుస్తుందని ఎద్దేవా చేస్తుంటారు. ఒక అమ్మాయి వెంబడి ఒక కుర్రోడు పడితేనే ఆమెకు గుర్తింపు వున్నట్టు వీళ్ళు వ్యాఖ్యానిస్తుంటే నాకు మతిపోతూ వుంటుంది. కాని నలుగురు స్నేహితులను కలసి ఒక గార్డెన్‌లోనో, ఒక హోటల్‌లోనో మాట్లాడు కుంటున్నప్పుడు పూటలు గడిచినా మనకు ఒక ఆనందం. అన్ని అభిప్రాయాలు భిన్నంగానే వుంటాయి. ఆ వాదనలో ఆ ఖండనలో ఆ నవ్వులో ఆ సమన్వయాల్లో మనం ఎన్నో అను భూతుల్ని పొందుతాం. కాని మా స్నేహితుల్లో ఈ స్నేహం కూడా నిజం కాదని వాదిస్తారు. పెండ్లి అయితే నా దిక్కు చూడవని ఒకరు, ఇతర దేశాలకు వెళ్ళితే ఫోన్‌చెయ్యవని ఒకరు ఆటలు పట్టిస్తుంటారు. ఇక ఇంటికి వస్తే మా మమ్మీ మా స్టేటస్ గురించి, ఆస్తుల గురించి, హోదా గురించి చెప్పిందే చెప్తూ వుంటుంది. అమెరికా వెళ్ళిన వాళ్ళే గొప్పని మా మమ్మీ ఉద్దేశం. రూపాయి తన దృష్టిలో ధనం కాదు డాలరే డబ్బని. మా అన్నయ్యలు ఇద్దరూ కంప్యూటర్ ఇంజనీరింగ్ చేసి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. వాళ్లకి మా మమ్మీ సంబంధాలు చూస్తుంది. ఫెయిర్‌గా వుండాలి, కోట్ల ఆస్తి వుండాలి, ఇంజనీరింగ్ చేసి వుండాలి, అమెరికా వెళ్ళడానికి సిద్ధమై వుండాలి. మా కులమై వుండాలి, మా ప్రాంతమై వుండాలి. 30 మంది బ్రోకర్లకు డబ్బు ఇచ్చింది. వాళ్ళు రోజూ ఫోటోలు తీసుకురావడం మా మమ్మీకు నచ్చకపోవడం నన్ను కూడా చూడమని అనడం నువ్వు చూస్తున్నావు కదమ్మా అని నేను అనడం ఇది ఒక పెద్దచర్చ. మా డాడీకి ఇప్పుడు చూపించను చివరగా చూపిస్తాను అంటుంది. ఆయన కొన్ని విషయాల్లో ఎడ్జస్ట్ అవుతారని మా మమ్మీ ఆలోచన, డబ్బు దేముంది అమ్మాయి ఎడ్యుకేషన్‌ని ఫెయిర్‌గా వుండడాన్ని చూడమని డాడీ అంటాడు. దేనిలో రాజీపడేది లేదని మమ్మీ అంటుంది. అదేమంటే మీరు పిల్లల్ని పట్టించుకున్నారా నేనే చది వించాను అని మమ్మీ అంటుంది. నువ్వు ఎక్కడ చదివించావు వాళ్ళు రెసిడెన్షియల్‌లో చదువు కున్నారని డాడీ అంటాడు. నీవు ఏమైన స్వయంగా వండిపెట్టావా, తినుబండారాలు పెట్టావా అని డాడీ అంటాడు. మీ మమ్మీ మీకు పెట్టి పెట్టి మిమ్ములను ఇలా తయారు చేసిందిగా అని మమ్మీ అంటుంది. ఇంక రణ రంగం. డాడీనే తగ్గు తారు. ఇక నీవు చూస్తే వాళ్ళకు పెండ్లి కాకపోగా వాళ్ళు అక్కడ ఎవరినో ఒకరిని చూసుకొని చేసు కునే పరిస్థితి వస్తుందని అంటారు. నా పిల్లలు అలాంటి వాళ్ళు కాదని మా మమ్మీ అంటుంది. మా అన్నయ్యవాళ్ళు మా మమ్మీ బాటలోనే నడు స్తారు. వారం వారం గంటలు గంటలు మాట్లాడు కుంటారు. ఎప్పుడూ డబ్బు గురించే వాళ్ల సంభాషణ. డబ్బుకు మనిషికి ఇంత బంధం ఏమిటని కూడా నాకొక పెద్ద చర్చ. మమ్మీ డబ్బు ఎప్పుడు ఖర్చు పెడుతూనే వుంటుంది. డబ్బుకు ఎప్పుడూ వెంపర్లాడు తూనే వుంటుంది. నువ్వు తప్పక స్టేట్స్ కెళ్ళాలని అంటుందే తప్ప నువ్వు పెండ్లి చేసుకోవాలని అనదు. నాన్నకు ఆ ఆలోచన వున్నట్టుంది. మా స్నేహితుల్లో చాలామందికి పెండ్లి చూపులు జరుగుతున్నాయి అన్నప్పుడు మేము సర్దాగా తోడు వెళతాము. ఏదో కొన్ని లక్షలు తగ్గాయని ఆ పెండ్లి ఆగిపోయిందంటే నాకు చాలా బాధ వేసింది. నిజానికి మా అమ్మంటే మా స్నేహితులందరికి భయం. ఆమె లేనప్పుడు ఇంటికి వస్తుంటారు కాని ఆమె ఎప్పుడూ వాళ్ళు వచ్చాక వస్తూనే వుంటుంది. మా అమ్మ మాట్లాడేప్పుడు ఎదుటివారు బాధ పడతారని ఆమెకు వుండదు. ఎదుటివాళ్ళు బాధపడితే కొన్ని సార్లు సంతోషిస్తుంది. అందరూ తిండికి లేక తన ఇంటికి వస్తారనే మనస్తత్వం తనది. తన స్నేహితులకు మాత్రం ఇల్లంతా దోచి పెడుతుంది. తనను పొగిడే వాళ్ళు కావాలి. తనకొక పెద్ద బెటాలియన్ వుంది. వాళ్ళు ఎప్పుడూ మా అమ్మని మీరు అంతటోళ్ళు, ఇంతటోళ్ళని గ్యాసిప్స్ చేస్తుం టారు. నీ వన్నీ మీ నాయనమ్మ బుద్ధులే అని తిడతా వుంటుంది మా అమ్మ. మా నాయనమ్మ


## రసమయి

( సాంస్కృతిక మాస పత్రిక)

**సంపాదకుడు : నండూరి పార్థసారథి**

వెల : రూ. 30/-

వార్షిక చందా : రూ. 300/-,

విదేశాలలో 40 డాలర్లు

ఎం.ఓ, లేదా డి.డి. నండూరి

పబ్లికేషన్స్ పేర పంపాలి.



**చిరునామా : రసమయి**

నండూరి పబ్లికేషన్స్ , ఎ -21, జర్నలిస్టు కాలనీ, జూబిలీ హిల్స్,

హైదరాబాద్ - 500 003. ఫోన్ : 040-23548352, 6541774

91-9866914560 (మొబైల్), editor@nanduri.com

చిన్నప్పుడు నన్ను వదిలేది కాదట. ఎప్పుడూ సంకనేసుకొని వుండేదట. మా నాయనమ్మ వున్న రోజుల్లో మా ఇంట్లో ఎప్పుడూ బంధువులు చెయ్యి కడిగే వాళ్ళని మా అంకుల్ వాళ్ళు చెప్తూనే వుంటారు. నాకు గుర్తు లేదు కాని మరి మా ఇంట్లో ఫోటోలు చూసినప్పుడు మా నాయనమ్మ ముఖంలో వున్న ప్రశాంతత నాకు ఇప్పటికీ ఆశ్చర్యం వేస్తుంది. ఇన్నీ వున్న మా అమ్మలో ఏదో అసంతృప్తి, ఆందోళన, చిరాకు, ఆరాటం కనిపిస్తాయి. తనకి ఈ హైద్రాబాదులో వుండే ఆభరణాలన్నీ కావాలని కోరిక. అన్ని బ్యాంకుల్లో అకౌంట్స్ కావాలని, కొత్త కొత్త పథకాల్లో చేరుతూ వుంటుంది. మా అమ్మ డిపాజిట్ చేసిన బ్యాంకులు కొన్ని ఎత్తివేశారు కూడా. ఇవన్నీ మా నాన్న దృష్టికి పోనివ్వదు. ఇన్ని వున్నా ఆమెకు నిద్ర కరువే. సర్వెంట్స్‌ని బాగా కసురుకుంటుంది బ్యూటీపార్లర్స్‌కి వెళ్ళి ఎంత మేకప్ చేయించుకున్నా మొఖంలో అన్‌రెస్ట్ కనిపిస్తూనే వుంటుంది. మరీ మా అన్నయ్యల పెండ్లి విషయంలో చాలా ఆందోళనగా వుంటుంది. ఆంధ్రదేశంలో మా కులంలో వున్న అమ్మాయిలను వరుసగా నిలబెట్టినా ఆమెకు ఎవ్వరూ నచ్చేటట్టు లేరు. నిజానికి మా అన్నయ్యలు అంత హాండ్‌సమ్‌గా ఏమీ వుండరు. ఒక మోస్తరుగా వుంటారు. ఇక మా స్నేహితులు పరిచయం చేస్తే మీ డాడీ ఏమి చేస్తుంటాడు. మీకు ఆస్తి ఎంత వుందని మా మమ్మీ లెక్కల్లోకి వెళుతుంది. అందుకే వాళ్ళు మా మమ్మీ ఎదుట పడటానికి ఇష్టపడరు. మా డాడీ నేను మాట్లాడుకునే టప్పుడు కూడా మా మమ్మీకి అనుమానం. తనగురించి ఏమి కామెంట్ చేసుకుంటున్నారో అని తలుపు సందుల్లో నుంచి వింటూ వుంటుంది. మాడాడీ ఎప్పుడన్నా ప్రేమగా తలనిమిరి నొసలమీద ముద్దు పెట్టు కుంటారు. అది ఒక్కటే ప్రేమకు సంబంధించిన గుర్తుగా నాకు కనిపిస్తూ వుంటుంది. మా ఇంట్లో అనుబంధానికి సంబంధించిన అంశాలు ఏమీ దొరకవు. కార్లు, డ్రైవర్లు, లాన్స్, గార్డెనింగ్ చేసేవాళ్ళు, కుక్కలు, వాటిని పెంచేవాళ్ళు వీళ్ళందరితో మా మమ్మీ అరుస్తూ వుంటుంది. మా డాడీ ఎవరినీ తిట్టరు కాని మా డాడీ అంటే అందరికీ గౌరవం. ఫైనల్ యియర్ వచ్చే సరికి మా స్నేహితులందరూ బిజీ అయిపోయారు. ప్రేమలు కబుర్లు అన్నీ మూలన పడవేసి అందరూ చదువులో పడ్డారు. థర్డ్ ఇయ్యర్‌లోనే ట్రోఫెల్ పాసైయ్యాను. ఫైనలియ్యర్ వచ్చేసరికి అన్నీ సిద్ధంచేసి పెట్టింది. పాస్‌పోర్టులు, వీసాలు నేను పాస్ అవ్వడం అన్నీ జరిగిపోయాయి. ఇక నేను ఈ రోజు అమెరికా వెళ్ళుతున్నాను. ఫ్లైట్ టికెట్టు బుక్ అయింది. అన్నయ్య వాళ్ళు అక్కడ రిసీవ్ చేసుకుంటారు. మార్నింగ్ 5గంటలకు ఫ్లైట్. డాడీ ఇంకా రాలేదు. సహజంగా డాడీ రాత్రులు ఎక్కడా వుండరు. నేను బయలుదేరి వాకిట్లోకి వచ్చాక డాడీ ఎదురుబడ్డారు. వృద్ధాశ్రమంలో తాతయ్య చనిపోయాడని తాతయ్యని విలేజికి తీసుకెళ్ళాలని డాడీ చెప్పారు. మా మమ్మీ ఒక నిట్టూర్పు నిటూర్చి పదపద అంటుంది. నా కాళ్ళు కదలలేదు. డాడీ దగ్గరికి వచ్చి మళ్ళీ నా తల భుజానికి ఆనిచ్చుకున్నాడు. నాకు కన్నీళ్ళు వచ్చాయి. నేను ఎటువైపు వెళ్ళాలో డాడీ నిర్ణయించలేని స్థితిలో వున్నాడు.నేను నిర్ణయించు కోలేని స్థితిలో వున్నాను. అప్పుడు మమ్మీ ఆజ్ఞ ఏదో వినిపించింది.... నా పాదాలు మొద్దుబారి అనుసరించాయి.....

# మథనం లేనిదెక్కడ ?

సమస్త సృష్టికి మౌలిక గుణం మథనం.
కాగే నీరు తనను తాను మథించుకుంటేనే
ఆవిరి ఆవిర్భవిస్తుంది.
విత్తుకడుపులో జరిగే మథనం ఫలితంగానే
తరు శిశువు తలపై కెత్తుతుంది.
తూర్పు పొందే మథనం వల్లనే
బాలసూర్యుడు జన్మిస్తాడు.
ఎత్తైన చూపు
ఏనాడూ శూన్యాన్ని అంటుకుని వేలాడదు.
అందని లోతులను ఆవిష్కరించడానికి
మథన పడుతుంటుంది.
అందుకు పర్యవసానమే
విభిన్న దృశ్య చిత్ర తోరణాలు
రూపు దిద్దుకోవడం.
నిద్రంటే
విస్మృతి మాత్రమే అని అనుకోరాదు.
అదీ అప్పుడప్పుడు మేల్కొని
మథనపడి
స్వప్నా కృతిలో ఆవిష్కృతమవుతుంది.
సమకాలీన సంఘటనల ఒత్తిడితో
సమాజ సముద్రంలో జరిగే
తీవ్రమథనం
పరస్పర విరుద్ధ శక్తులను పైకెగ జిమ్ముతుంది.
అన్నీ గమనిస్తున్న మేధ
తానూ మథనపడుతుంది.
అయితే అది
కేవలం ఒక సాక్షిగా మిగిలిపోదు.
ఆ రెంటినీ సమదృష్టితో స్వీకరిస్తుంది.
పెడదారి పడుతున్న గతులకు
మార్గ నిర్దేశం చేస్తుంది.
మథనమే లేని మేధ
వట్టి మాంసం ముద్ద.
సృష్టి సురుచిరంగా వెలగాలన్నా
మనోదృష్టి సునిశితంగా నిలవాలన్నా
మథనం అనివార్యం.

- డా॥ సి.నారాయణరెడ్డి